వనితాలోకం:

తిరుగుబాటు

"కేసరి"

"నా బుజ్జితల్లివికదూ! ఈ ఒక్క సారి నా ముచ్చట తీర్చమ్మా! ఇక మీదట నీయిష్టం, మీ అన్నయ్యయిష్టం! ఈసారి మాబుద్ధి గడ్డితిని వాళ్లను మా గడప త్రొక్కమన్నాం... నా తల్లివికదూ..." అంది కమలమ్మ.

"క్షమించమ్మా! నీవూ, మామయ్యా చేస్తున్న ఈ దౌర్జన్యాన్ని సహించలేను. నాన్న ఉంటే ఈ అక్రమానికి ఒప్పుకొనే వాడేకాదు ... నేను, అన్నయ్యదగ్గర చెప్పి పోయిగా హాస్టల్లోనైనా చేర్తాను - అహోరాత్రాలు ఈ పోరైనా తప్పుతుంది" అని విసురుగా కాలేజీకి పోయింది నిర్మల. కమలమ్మ నిశ్చేష్టయై సోఫాలో చేరగిలబడింది, కూతురుపోయినదిక్కే చూస్తూ!

"అదేం? అక్కగారూ! అలా దిగాలు పడిపోయున్నారేం?" అంటూ పొరుగింటి శేషమ్మ కమలమ్మను హెచ్చరించేవరకు ఆమె ఆవిధంగానే కూలబడివుంది.

"రా శేషమ్మా! అలా కూర్చో! ఏదో నామనసే చెదిరిపోయింది ... ఏం ఉంది! ఈయింట్లో అన్నీ విడ్డూరాలే! ఏం చదువులో! ఏంబుద్ధులో!..అన్నకుతగ్గ చెల్లెలూ, చెల్లెలుకుతగ్గ అన్న!! సరిగ్గా కుదిరారు నా ప్రాణానికి...అంతా నా తలవ్రాత! లేకుంటే నన్ను ఏకాకినిచేసి ఆ పుణ్యాత్ముడు తప్పుకునేవాడా?" అని కన్నులు ఒత్తుకుంది.

"ఛాఛా అదేమిటమ్మా కన్నీళ్లు పెట్టుకుంటావు? ముత్యాల్లాంటి పిల్లలతల్లివి, నీకేం కమలమ్మా? ఐనా నీవు చిత్రంగా అంటున్నావే? మురళిబాబంటే ఊర్లో ఎంత పేరు! ఎంతప్రతిష్ఠ! తండ్రికితగ్గ కొడుకని నలుగురూ అంటున్నారు. ఇంత చదువు చదువుకున్నా రవ్వంత గర్వమున్నా ఉందా? మొన్న ఎవరో మా ఆయనతో అంటూంటే విన్నా 'ఆ మురళిబాబండీ, ఇంత చిన్న వయసులోనే ప్రొఫెసరు పనిచేస్తున్నా - మనుష్యుల్ని చూస్తే ఎంత మన్నన, ఎంత మర్యాద!' అసలు కాలేజీ కుఱ్ఱవాండ్లు కూడా ఆయన్ను నెత్తిన పెట్టుకొని పూజిస్తూంటారటగా? ... అమ్మాయిమాత్రం? రూపానికితగ్గగుణం...గుణానికితగ్గ చదువూ ......"

"అదేశేషమ్మా నేననేదీనూ! లోకాన్ని మెప్పించారుకాని వాళ్లు కన్నతల్లి గోడేమైనా వింటున్నారా?...నా మెప్పు అసలు వాళ్లకు అవసరమైతేగా? ... నేనెంతగా తల్లడిల్లిపోతున్నానో, లోలోపల కుమిలిపోతున్నానో వాళ్ళకేం తెలుసు?... బెండ ముదిరినా, బ్రహ్మచారిముదిరినా పనికిరాదన్నట్లు వాడికిముప్ఫయేండ్లునెత్తికొస్తున్నా ఏమన్నా తెముల్తున్నాడా? ఎన్ని సంబంధాలు! ఎన్ని సంబంధాలు!!... వేలకు వేలిచ్చి రంభల్లాంటి పిల్లల్ని కట్టబెడ్తామని ప్రతిమాలుకున్న వాళ్ళని కాదనేశాడు. పోనీ...నీకు నచ్చిన అమ్మాయేదో అదైనా చెప్పరా అంటే, దానికీ పలుకు ఉలుకూ లేదాయె! పచ్చగా కళకళలాడవలసిన ఇంట్లో ఈ భీష్మించడాలేమిటమ్మా?... సరే వాడు సరే మగవాడనుకుంటే అమ్మాయికి దాదాపు యిరవయ్యేండ్లు దగ్గరకొస్తున్నా దాని సంగతన్నా వాడేమైనా అనుకుంటున్నాడా?...సరి యిక దాని తరహా యిట్లా...అసలు వాడి చనువు చూచుకునే దాని మిడిసిపాటూ, మాట దుడుకూ అంతా!...నీవు చెప్పు శేషమ్మా! పెండ్లి చూపులకని ఎవళ్లో యింటి గడప త్రొక్కవస్తే, ఈ పిల్లదేం పోయిందీ దీని అఘాయిత్యం కాకపోతే, వాళ్ళముందర కనబడటానికి అవమానంట! అగౌరవంట!! నేనూ నా తమ్ముడూ దౌర్జన్యాలు చేస్తున్నాంట! ...ఎందుకులే చెప్పుకున్నా నాకే తలవంపులు!...అయినా ఏదో పచ్చగా వాళ్ళ ముందు కనబడడమేనా?...ఊరేగమన్నామా లేక నాటకొంగాడమన్నామా, కాలేజీల్లో లాగ?...ఎంత బి ఏ లు, ఎం ఏ లు వెలిగించినా ఈ విపరీతపు పోకిళ్ళేమిటంట?"

"ఆఁ...ఏదో సిగ్గుపడ్తుంది గావాలెఁ కమలమ్మా! అంత మాత్రానికే నీమాట కాదంటుందా?"

"సిగ్గూ లేదూ, చటుబండలూ లేదూ! అవంతా వాళ్ళ చదువులమ్మా, చదువులు! మనమంతా వాళ్లకు మనుష్యులక్రింద జమా? మనకు చదువా సంస్కారమా? ఐనా నేనంటే వాళ్లకి అసలే లెక్కలేదు!...ఏదో నా తమ్ముడంటూ ఒక దుండబట్టి వాడి కడుపు చల్లగా ఈ యింటి వ్యవహారాలూ, పొలము బుట్రా చూచుకుంటున్నాడు....ఆ కిష్టిగాడు నలుగురి కాళ్ళావేళ్లాబడి ప్రతిమాలి భంగపడి సంబంధాలు తేవడం, వీళ్లు ప్రతిదాన్ని కాదనడం! వాడు కాబట్టి వీళ్లు ఎంత ఏడిపించుకుతిన్నా, పరిహాసాలాడినా నెత్తి కెక్కించుకుని తిరుగుతున్నాడు!...ఈరోజు సాయంత్రం విజయవాడనుంచి ఒక గొప్పింటివాళ్లని అమ్మాయిని చూడ్డానికని కిష్టడు పిలుచుకొస్తూంటే ఈపిల్ల ససేమిరా నేను సాయంత్రం యింటిపట్టుకూడా రానని ఎగుగుతిరుగుతుందా? భయం భక్తి, మంచీ చెడ్డా, చిన్నా పెద్దా ఉన్నవాళ్ళేనా వీళ్లు?"

"అబ్బబ్బే! ఏమీ ఆందోళన పడకండక్కయ్యగారూ! అంటారే కాని వయసొచ్చిన పిల్ల అలా ఎందుకు చేస్తుందిలెండి? సాయంత్రం చక్కగా ముస్తాబై లక్ష్మిలా తయారౌతుంది వాళ్ళొచ్చేలోపుగా! మీ ప్రయత్నాల్లో మీరుండండి ఏదో చనువుకొద్దీ మిమ్మల్ని కొంచెం ఉడికిస్తారంతే!" అని ఊరడించి శేషమ్మ సెలవుతీసికొని వెళ్లింది. కమలమ్మ దీర్ఘంగా నిట్టూర్చి, రంగని విగ్రహానికి చేతులు జోడించి, తనపనివైపు మరలింది.

* * *

నిర్మల మధ్యాహ్నం ఇంటివైపుకూడా రాలేదు హాస్టల్లోనే స్నేహితురాండ్రతో తినీ కాలంగడిపేసింది. ఆమె హృదయం

పండిత డి. గోపాలాచార్యులవారి
అరుణా
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్, మదరాసు-17.

భావసంగ్రామంతో కురుక్షేత్రమైంది. అమ్మ కన్నీళ్ళకు భయపడి తల ఒగ్గడమా, లేక తన వ్యక్తిత్వాన్ని, ఆదర్శాలను, ఏమైనా సరే వానిని కాపాడుకోవడమా? ఆమెకు కర్తవ్యమేమిటో బోధపడడం లేదు.

నిజంగా నిశ్చల ఆదర్శాలలో పుట్టి పెరిగి [illegible]ంచే అన్నయ్య అడుగుజాడలలో నడుస్తోంది, ప్రతివిషయంలోనూ! తన జీవిత లక్ష్యాలను తీర్చిదిద్ది, తన వ్యక్తిత్వానికొక రూపాన్ని ప్రసాదించినవాడన్నయ్య!

"డబ్బిచ్చి కొనుక్కున్న ప్రేమ! ఛీఛీ! వ్యభిచారానికీ ఈ అమ్ముడుపోయిన మనుష్యుల ప్రేమకి తేడా యేమిటి?" అనుకునేది నిశ్చల కట్నాల ప్రస్తావన వచ్చినప్పుడల్లా! అందుకే కట్నాన్ని కాంక్షించిన యువకులను, ఎంత చదువుకున్నా నిశ్చలంగా తిరస్కరించింది.

నిశ్చల శరీరమాత్రమే క్లాసులో వుంది. ఆలోచనలన్నీ పరిపరి విధాల రెక్కలు వచ్చినట్లు విహరిస్తున్నాయి. ఎంత ప్రయత్నించినా పాఠాలమీద మనసు లగ్నం కాలేదు.

ఎన్నిమార్లని నీచమైన పెండ్లిచూపులనే ఈ ప్రదర్శనలకు అంగీకరించడం? చచ్చు ప్రశ్నలు, అంతకంటే అసహ్యకరమైన అష్టప్రశ్నలు! అన్నీ అయిన పిమ్మట బజారు బేరాలు! ఛీఛీ అచ్చం బజారు మనుష్యులు!!— అనుకుంటూవుంది, యింతలో వీపు చుర్రుమనేసరికి 'అబ్బా' అంటూ వెనక్కు తిరిగిచూచింది నిశ్చల. విమల విరగబడి నవ్వుతూంది. తరగతిలో ఒక్క పెట్టు తేసు! ఎప్పుడు గంట కొట్టారో మరి, తన ధోరణిలో తాను పడుందాయె!... విమల తన నోట్సు తీసి చూస్తూ పొట్ట చెక్కలయేలా నవ్వుతూంది. తనకేమీ అర్థం కాలేదు సరి కదా ఎక్కడలేని చికాకు వేసింది. కోపంతో ఎరుపెక్కుతూన్న నిశ్చల ముఖాన్ని చూచి విమల చేతులు జోడించి నాటకఫక్కీలో "దండమూర్తీ! భద్రకాళీ! మామీద కన్నెఱ్ఱ చేసి చేయి చేసికోకండి!" అంటూ వేళాకోళం ప్రారంభించేసరికి నిశ్చలకు మరీ రగిలిపోయి హుంకరిస్తూ, విమల చేతిలోని నోట్సుని తటాలున లాక్కుంది. అందులో చూస్తే ఏముంది? కాగితాలనిండా పిచ్చి గీతలు చూచి నిశ్చల వెలవెలబోయింది. విమల మళ్లా విరగబడి నవ్వుతూ "చూచారా మీ చదువులెలా వెలిగిపోతున్నాయో? ఇల్లా అయితే మీ అన్నయ్యకి తగ్గ చెల్లెలనిపించుకుంటావు లే!... ఐనా ఏమిటబ్బా సంగతి? ఈ మతిమరుపూ, పరధ్యాన్నం అదీ, కొంప తీసి ప్రేమకలాపం భామ విలాపం...?"

"ఛీ నోర్మూయ్" అని నిశ్చల విమల జడ పట్టి గుంజి కన్నుల నీరు కార్చడం మొదలెట్టింది.

విమల నొచ్చుకుని "క్షమించు నిశ్చలా! నిన్ను గాయపరిచినట్లున్నాను.....రా, పోతూ మాటలాడుకుందాంలే" అంటూ లాక్కుపోయింది.

"విమలా! నాకొక్క సహాయం చేయవూ? నీ మేలెప్పటికీ మరిచిపోను. ఈ రోజుకి మాత్రం నీ రూంలో నాకు చోటివ్వు తల దాచుకోడానికి."

కొయ్యబారిపోయింది విమల. తెప్పరిల్లి "అదేమిటి నిశ్చలా! ఏం జరిగిందేమిటి? ప్రతి విషయంలోనూ మాకెంతో ధైర్యం చెప్తూండేదానివి, నీవే యిల్లా బేలవైనావేం?" అంటూ హాస్టల్లో తన గదిలోకి తీసికొని వెళ్లింది.

నిశ్చల తన హృదయ భారాన్నంతా ఒక్కమారు తన నెచ్చెలికి వెల్లడించింది. తన నిస్సహాయ స్థితిని తెలిపి కన్నీరు వెల్లువలయ్యేలా వగచింది. అంతా విన్న విమల "నిశ్చలా! నీకు కోపం రాదంటే ఒక్క మాటడుగుతా! నన్ను మాత్రం తప్పుగా అర్థం చేసికోకు! పెండ్లిచూపులకని ఎవరో ఒకసారి వస్తే నీకేం? నీట్ గా టాయిలెట్ అయి వాళ్ళముందర కనబడు! తరవాత మీ అమ్మకు చెప్పెసెయ్ కచ్చితంగా నాకిష్టం లేదని! ఇంత దానికే నీవు ఇంతగా క్రుంగిపోయి, ఏదో అవమానం జరిగినట్లు బాధపడడం దేనికి?... అయినా యీ తతంగం అంతా ఇపుడు కొత్తనా, తరవాతనా తప్పేది కాదుగా? నీకు నచ్చేవాడొచ్చేవరకు అందరినీ నిరాకరించు! అంతేగా?"

నిశ్చల విషాదంగా నవ్వుతూ "నా ఆవేదన నీకు తెలీదు విమలా! ప్రతి ఒక్కడూ ఒక గుంపును పిలుచుకొచ్చి మా యింట్లో తిష్ఠ వేసి బాతాఖానీలు, విందులూ! బుట్టబొమ్మలా తయారై వాళ్ళముందు నేను నిలబడడం! నేను చెప్తున్నా నమ్ము విమలా! కాలేజీ ఉపన్యాస వేదికమీద, నాటక రంగంలో కూడా నేనంత కంగారుపడలేదు. నా శరీరంలో ప్రత్యణువూ కుంచించుకొని పోతుంది వాళ్ళచూపులతో — సిగ్గుతో, అవమానంతో!!

ఛీఛీ ఆత్మగౌరవంగల ఏ స్త్రీ ఒప్పుకుంటుందీ నైచ్యానికి? 'అమ్మాయి ఎంతవరకు చదువుకుందని ఒకడడిగితే' మరొకడు 'కాలేజీ చదువులు చదివినమ్మాయే' నని దిక్కులు చూడడం. 'కర్ణాటక సంగీతం వచ్చా'ని ఒకడు 'ఎంకిపాటలు' వచ్చాని మరొకడు 'అంట్లుతోమడానికి అసహ్యపడదుకదా'ని ఒకడు 'ఆధునిక భావాలున్నాయా'ని మరొకడు వెకిలి నవ్వులు వెలిగిస్తాడు. ఈ అవకతవక ప్రశ్నలకు సమాధానం చెప్పడంకంటే కొర్రులకెక్కడం ఏమాత్రం తగ్గిపోదు! అంతా అయిన వెనక మా వాళ్లూ వాళ్ళూ కలిసి ఎద్దుల సంతలోలాగా బేరాలు సాగించడం! ఈ అన్యాయానికెన్నిమార్లు తలఒగ్గినా ఆత్మాభిమానాన్ని ఖూనీచేసుకోను విమలా?"

"సరే నిశ్చలా! కాని యిందులో నీవొక్కతెవే ప్రత్యేకంగా అనుభవిస్తూన్న అవమానం యేముంది? ఇది స్త్రీ జాతిఅంతా అనుభవిస్తున్నదే!"

"అందుకే నా తిరుగుబాటు తరతరాలుగా నిర్జీవమైపోయిన స్త్రీజాతి యికనైనా ఈ దౌర్జన్యాన్ని ఎదిర్చి తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలి! స్త్రీ పురుషుని ఆటవస్తువుగా వుండడం, అతనికి విలాసాన్ని కలిగించడమే తన జీవిత పరమావధిగా తలుస్తూ తన అభిమానాన్ని, ఆదర్శాలనూ అన్నిటినీ చంపుకొని.....నా హృదయంలోని ఆందోళన నీకు చెప్పలేకుండా వున్నాను విమలా!... నేనిపుడు పెండ్లి పెండ్లంటూ వాచిపోర్చి లేదు... ఎప్పుడైనా వివాహ జీవితాన్నే కోరితే, తన వ్యక్తిత్వాన్ని రూపాయలణాలు పైసలతో కొల్చుకునే పురుషుణ్ణి మాత్రం సహించలేను... అమ్మ అంటుంది - 'మనకుంది మనం యిస్తాం' అని. కాని ప్రేమను డబ్బుతో కొనుక్కోలేను విమలా! కొనుక్కోలేను..."

"ఎంత అమాయకురాలివి నిశ్చలా నీవు! ఇవన్నీ కాదని నేనను కానీ, నీవూ నేనూ తలబ్రద్దలు చేసుకున్నా ఈ కుళ్ళిన సాంప్రదాయాలు పోతాయంటావా? ఇలాంటి అభిప్రాయాలు పెట్టుకుంటే 'ఒక్కతెను నాకేల ఓపలేని సుకము' అంటూ జీవితమంతా..."

నిశ్చల ఉద్రేకంతో చివాలున లేచి "అక్కడనే మనమంతా పొరబాటుపడి గడ్డి మేస్తున్నామంటాను. ప్రతిమగవాడూ, ప్రతి ఆడది, తప్పనిసరిగా వివాహజీవితానికి తలొగ్గాలని ఎక్కడుంది? మానవత్వపు విలువలు, వ్యక్తిత్వపు విలువలు అన్నిటిని బుగ్గిచేసైనా వైవాహికబంధంలోపడి వురేసుకోపోతే, సంసారధర్మంకంటే మించిన మానవధర్మం లేదని యెందుకనుకోవాలి?"

"ఓస్ అబ్బా! ఉపన్యాసాలు దంచకమ్మా! ఇవన్నీ వినివిని చెవులు దిమ్మెక్కినవేగా? ఇంతకూ మీ అన్నయ్యేమంటాడు? అతనితో నీవు చాలా చనువేగా, నీవేం చెప్పలా?"

"చెప్పకేం విమలా! ఆయనగారికిదంతా ఒక గొప్ప తమాషాట! జీవితంలో వింత మనుష్యులనూ, వింత మనస్తత్వాలనూ గమనించడానికి మంచిఅవకాశంట! 'ఈతతంగం అంతా సీరియస్ గా తీసికోకు చిట్టీ! నేనిక్కడున్నంతవరకూ నీ యిష్టానికి వ్యతిరేకంగా యెవ్వరూ పోలేరు', అంటాడు ఐనా నేను మాత్రం యిక భరించలేను."

"సరే యిపుడేం చేస్తామని నీవూహ?" -

★ తిరుగుబాటు ★

కుప్పగా కూలిపోయింది నిశ్చల "అదే విమలా! ఏమీ తోచకుండా వుంది. నేనింటికి పోకుండా వుంటే యిప్పటి కీగండం గడిచినా అందరూ గగ్గోలుపడతారు. అన్నయ్య సానుభూతికూడా ఎక్కడలేకుండా పోతుందోని భయపడ్తున్నాను. ఇంటికి వెళ్తేమాత్రం యీ విషమపరీక్ష తప్పదు" అని విమల ఒడిలో తలదూర్చి విలపించింది.

విమల ఆలోచించింది.

"నిశ్చలా నాకొక్క ఊహ తట్టింది. గుండె నిబ్బరంకలదానివి కాబట్టి నీవుమాత్రమే యీవిధంగా చేయగలవు" అని నిశ్చల చెవిలో తన వ్యూహాన్ని వివరించింది. తడియారని నిశ్చల కనుగవలో వింత వెలుగు మెరిసింది! కృతజ్ఞతతో నెచ్చెలిని కౌగలించుకొని నిశ్చలంగా ఇంటివైపు నడిచింది నిశ్చల!

* * *

చైతన్యరావు, అద్దెకారులోనుండి కాలు క్రిందికి మోపేందుకు ముందుగానే, ఇంటి వాకిట్లో తనకొరకే ఎదురుతెన్నులు చూస్తున్నట్లుగా నిలుచున్న ఒక మనిషి వినయ విధేయతలతో ఎదురువచ్చి "దయచేయండి బాబుగారూ! దయచేయం"డని చేతులు నులుముకుంటూ నిలబడేసరికి తెల్లబోయాడు అయినా వెంటనే తేరుకొని "ఆఁ...మురళీధరరావుగారిల్లిదేనా?" అనడిగాడు.

"చిత్తం దొరా! మీరు లోపలికి దయచేయండి" అంటూ సామాన్లు లోపలికి చేరవేయడం ప్రారంభించాడు.

చైతన్యరావు లోపల అడుగుపెట్టాడు. కమలమ్మ తొట్రుపాటుతో హాలులో స్తంభపు క్రీనీడలో నిలబడి "రా నాయనా! అలా సోఫాలో కూర్చో" అనంగానే నివ్వెరబోయిన చైతన్యరావు "నమస్కారమండీ" అన్నాడు. కమలమ్మకు బ్రహ్మానందమైంది. "ఒరే సోమప్పా! ఆ పేపర్లూ, మేగజైన్లూ ఆ టేబిలుమీద ఉంచరా! ఆ రేడియో ప్లగ్ తగిలించు!...ఏం సంకోచపడకు నాయనా! అబ్బాయీ అమ్మాయీ యింకా కాలేజీనుంచి రాలే. ఈ రోజైనా కాస్త తెమలి రండర్రా అని మరీ మరీ చెప్పాను!......సంగతి సందర్భాలు ఏవీ తెలవ్వు పిల్లలకి......సోమప్పా! నీవైనా పోయి వాళ్ళని తీసుకురారా!"

చైతన్యరావుకసలేమీ పాలుపోలేదు. వేయి ప్రశ్నలు బుఱ్ఱలో మెదిలాయి!... కమలమ్మ గొంతు సర్దుకొని, తన సందేహాన్ని వెళ్ళబెట్టింది. "అయినా అబ్బాయీ! నీ వొక్కడివే వచ్చావేం? మీ తండ్రిగారూ వాళ్ళూ రాలేదే?" అని.

చైతన్యకు ఈ ప్రశ్నలు అసందర్భంగా తోచినాయి. తన పనిమీద తానొస్తున్నపుడు నాయనలు నాయనమ్మలు రావడం దేనికో అసలు బోధపడలేదు.

"నేనేమైనా కుఱ్ఱవాణ్ణా యేమైనా నాకు తోడు రావడానికి? వాళ్ళింట్లోనే ఉన్నారులెండి" అని వినయంగా సర్ది చెప్పాడు.

కమలమ్మ "ఔనులే! తోడు రావడానికి నీవేమైనా తెలియనివాడివా యేం" అంది పిల్లవాడి చొరవకి, కలగలుపుతనానికి మురిసిపోతూ!

"ఒక్క క్షణం వాళ్ళొచ్చేవరకూ ఎలాగో గడుపు నాయనా ఇంతలో వాళ్ళూ వచ్చేస్తారులే!"

"నాకేం ఫరవాలేదు లెండి! మీరేం శ్రమ తీసుకోకండి" అన్నాడు చైతన్యరావు, ఈ ఆదరానికి తికమకపడుతూ. కమలమ్మ వంటయింట్లోకి పోతూ అటువైపు మొగమై పత్రిక చదువుకుంటున్న అబ్బాయిని విమర్శనగా చూచి "ఏమైనా చూడు— పెద్దయింటి పెంపకం తరహాసే వేరు ఏమి మర్యాద ఏమి వినయం, ఏమి విధేయత..." అనుకొని రంగడికి చేతులు జోడించి "రంగా భారమంతా నీమీదే వేశాం, ఏం చేస్తావో" అనుకుంది.

అటు చైతన్యరావు "హారే భగవాన్! ఏమి మర్యాద! ఏమి ఆదరణ! వీళ్ళ దృష్టిలో నే నెవర్నిమిటి? కొంపతీసి పొరబాటేమైనా జరగలేదుకదా?...అబ్బెబ్బే టేబిల్ మీద వాడి ఫోటోకూడా వుంటే!... ఐనా?...సరి...సరి... ఇదంతా మనవాడి కట్టుదిట్టాలు గావల్ను!! శభాష్!" అనుకుంటూ మెల్లగా తనకు తానే నచ్చ చెప్పుకుంటున్నాడు.

ఇంతలో వాకిలి మెట్లమీద స్లిప్పర్ల చప్పుడైంది. చైతన్యరావు తిరిగిచూచే లోపుగానే ఆ హాలులో ఒక మెరపు తీగ మెరిసినట్లయింది. చైతన్య కన్నులను బలవంతాన త్రిప్పుకొని పత్రిక పుటలు త్రిప్పుకుంటూ "లేనిపోనిది నెత్తికి తెచ్చుకున్నాను!...మావాడికైనా ముందు రాయకపోతిని...ఈ సస్పెన్సూ ... సందేహాలు వుండేవి కావు ..." అనుకుంటున్నాడు. ఇంతలో ప్రక్కన టేబిల్ మీద చప్పుడయ్యేసరికి, అసలే మునివ్రేళ్ళమీద కూర్చున్నవాడాయె, అదిరిపడ్డాడు. ఈసారింతకుముందు తన కనులలో మెరిసిన శంపాలత రూపము దాల్చి నిలబడి తనవైపుకి కాఫీ ట్రే జరిపింది. చూచీ చూడనట్లు ఆమె ముఖంతట్టు చూచాడు. చెదరిన ముంగురులూ, కొంచెమైనా కృత్రిమమైన అలంకారాలు లేని సహజ సౌందర్యమూ! కానీ ఆ విశాల నేత్రాలు అరుణ కిరణాలు వెదజల్లుతూ నిర్లక్ష్యంగా సూటిగా తనలోకి చూస్తూందా అనిపించింది. ఆమె ముఖంలో గంభీరమైన భావోద్వేగం చూచేసరికి చైతన్యరావు హృదయం క్షణం లయ తప్పి వింత పనైంది. ఎందుకంటే వాతావరణ శాస్త్రంలో ప్రత్యేకంగా పరిశోధనలు చేస్తున్న తనకు తెలుసు - బ్రహ్మాండమైన తుఫాను లేవడానికి ముందు ప్రకృతిలో అచ్చం అదే లక్షణాలుంటాయని! ఐనా మనసు చిక్కబట్టుకొని - "నావల్ల మీ కందరికీ చాలా శ్రమ కలుగుతూందల్లేవుంది" అన్నాడు.

ఆ చూపుల్లోకంటే నిర్లక్ష్యం ధ్వనించే గొంతుకతో "ఇందులో మాకేం శ్రమ లేదులెండి!...ఐనా ఈ తతంగం అంతా మాకొక అలవాటైపోయింది!.... మీకైనా... ఇది క్రొత్తగాదేమో?.. మీకూ యిలాంటివి నిత్యానుభవాలే అయ్యుండాలి" అంది.

ఈ ఎత్తిపొడుపుతో చైతన్యరావు ముఖం అవమానంతో, ఆక్రోశంతో ఎఱ్ఱబడింది. పరిస్థితి యింతగా పట్టాలు తప్పుతుందని అనుకోనేలేదతడు. మాటలు రెచ్చగొట్టేటట్లున్నా, దిగమింగుకుంటూ, వీలైనంత మర్యాద స్ఫురించేటట్లుగా "క్షమించండి! మీరు నన్నుగూర్చి పొరబడినట్లున్నారు... నేను మీ రనుకొన్నట్లు..."

"క్షమించండి!...ఎవరు ఎవర్ని క్షమించడం? ఎంతకాలమని క్షమిస్తూండడం? ఈ మగజాతిని క్షమించడానికి తగిన క్షమా హృదయం ఉండబట్టే మాకీ దుర్గతిపట్టింది. పొరబాటుపడిందసలు మీరు కాని నేను కాదు!...మీరిక్కడికివచ్చేముందే మీ ముఖంమీద— మేమంగట్లో కొనుక్కునే చీరలకు కట్టినట్లు, ఒక అట్టముక్కమీద మీ అమ్మకపు వెల వ్రాసి కట్టుకొనొచ్చుంటే వెంటనే నేనే తేల్చి చెప్పేసేదాన్ని— మీ వెల గిట్టుబాటవుతుందో లేదో!... ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు! చెప్పండి— మీ చదువు సంస్కృతి, నాగరకత, సభ్యత, వ్యక్తిత్వం— వీటన్నిటి విలువ ఎన్నివేలు? మీ వెలయెంత?— చెప్పరేం?" అని హుంకరించింది.

చైతన్యరావు విద్యుద్ఘాతం పడ్డవాడిలా కన్ను లప్పగించి, విరుచుకొని పడ్తున్న ఆ ప్రళయమారుతంలో, కదలక మెదలక ఉన్నాడు. గుండెలు మాత్రం పందెపు గుఱ్ఱాల డెక్కల చప్పుడులా కొట్టుకుంటున్నాయి. అతని భయమల్లా యే క్షణంలో కిటికీలోని పూలతొట్టి తన నెత్తినపడ్తుందో అనో లేక ఏ క్షణంలో తానూ తన సరంజామా అంతా వీధిలో పడతామో అనో అయ్యుండాలి! ఏ విధంగానైనా ఆ ప్రళయాగ్నికీలను శాంతింపచేసే సదుద్దేశంతో "మీరు ఘోరమైన పొరబాటు పడుతున్నారని చెప్పడానికి విచారిస్తున్నాను... ఒక్క క్షణం శాంతించారంటే మీకు నచ్చ

"చెప్పగలను," అనే లోపుగానే, నిశ్చలకు రోషమూ, కోపమూ ఉప్పెనగా వచ్చాయి. "శాంతించినంత కాలమూ శాంతించాను! ఓర్చుకోవలసినంత కాలం ఓర్చుకున్నాను! నీతీ, నిజాయితీ, ఆత్మగౌరవం ఏవీ రవ్వంతైనా లేని పశువులముందు సిగ్గు, అభిమానాలు చంపుకొని, సింగారించుకొని వాళ్ళ పరిశీలనకు తలవంచాను!... నేను కొదవలేక కాదు!...నా తల్లి కన్నీళ్లకు వెరచి! ఇంట్లో ప్రశాంతానికి భంగం రాకూడని!...... ఇదుగో ఇది నా తిరుగుబాటు!! పశువుల సంతల్లోలాగా మిమ్మల్ని డబ్బిచ్చి కొనుక్కుంటూన్నపుడు, మీ విలువల్ని, మీ రంగుల్ని, మీ తెలివితేటల్ని పరిక్షించేందుకు వాక్కూ, అధికారం నాకుంది. అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పండి—" అంటూ తెచ్చిపెట్టుకున్న హుందాతనంతో, ధీమాతో ఇంతసేపూ నిలబడివున్నది, సోఫాలో ఠీవిగా కూర్చొని గంభీరంగా—

"మీ రెంత వరకూ చదువుకున్నారు?"

"ఏం చదువుకున్నారు?"

"మీ చదువు మీ జీవితానికి, మీ లక్ష్యసాధనకు ఏవిధంగా వుపయోగిస్తుందని మీ ఊహ?"

"ఆటల్లో, స్పోర్ట్సులో పాల్గొన్నారా? టెన్నిస్ ఆడడం వచ్చా?"

"మీకు చీట్లాట, సిగరెట్లు, గుఱ్ఱపు పందాలు మొదలైన మంచిలక్షణాలేమైనా వున్నాయా?"

"మీకు మన సంఘంలో, మతంలో పాతుకొనిపోయిన అన్యాయాలను, అత్యాచారాలను, మూఢనమ్మకాలను ఎదిరించడానికి కావలసిన ధైర్యం, సాహసం, మగటిమీ వుందా?"

"మీరు స్త్రీని గౌరవించడమనే సాంప్రదాయం నాగరికతా యేమైనా పాటిస్తారా?"

"పోనీ యివన్నీ తెలియకుంటే మానె... ముదిరిన బెండకాయలని కనిపెట్టడం యెట్లా? లేత వంకాయల లక్షణాలేవిటి?

పాతబియ్యానికీ కొత్తబియ్యానికీ, తేడా యేమిటి? పొయ్యిలో నిప్పుచేయగలరా?

పాకశాస్త్రంలో యేమాత్రం ప్రావీణ్యం ఉంది? అనే ప్రశ్నలవర్షం కురిపించింది.

చైతన్యకు అంత క్రైసిస్‌లోనూ ఆ ప్రశ్నలోని నిశితమైనహాస్యమూ హేళనా బోధపడ్డాయి. నిశ్చల ఆవేశంతో తన్ను తానే మరిచిపోయి యింకా యేదో చెప్తూనేవుంది. చైతన్య ఆవీరమూర్తిని చూచి చకితుడైనాడు. నిశ్చలకంటికొనలలో నీరు నిండింది. గాలి దుమారంలోని లతవలె ఆమె తనువు అల్లాడిపోతూంది. నిశ్చల, యెదుటకూర్చొనున్న చైతన్యనుకూడా మరచి దూరంగా చూస్తూ, రక్తారుణనేత్రాలతో, మాటలనే తూపులుగా పురుషజాతికిపటిన బూజును, దుమ్మును దులిపి, వాళ్ళ నిరంకుశాధికారాన్ని పింజపింజలుగా చేస్తున్నదా అనిపించింది. చైతన్య ఆ స్త్రీమూర్తిముఖంలోకి నమ్రభావంతో, వర్ణనాతీతమైన గౌరవంతో చూస్తున్నాడు. రౌద్ర బీభత్స రసాత్మకమైన ఆమె ముఖకమలంలో అలసతవల్ల స్వేదబిందువులు ముత్యాలసొంపుకూర్చి వింత సోయగాన్ని దిద్దినాయి.

ఇంతలోనే చైతన్యమెదడులో మెరపులా మెరిసింది - వీళ్లు యెదురుచూస్తూండిన వ్యక్తి తానుకాడనీ, పెండ్లిచూపులకై వచ్చే యే మహాపురుషుడో అయ్యుంటాడని అతని హృదయం ఒక్కసారి నిట్టూర్చింది. వెంటనే చైతన్యలో ఇంతసేపూ భయపడి అడుగునపడి అణిగిపోయున్న చిలిపిదనం కట్టలు త్రెంచుకొంది. పరిస్థితులను క్షణంలో ఆకళింపు చేసుకున్నాడు. అంతేకాదు, యెదుటనున్న అమ్మాయి పన్నిన పన్నుగడ అర్థం కావడంతో, ఆమె ఆదర్శాలెంత వున్నతాలో, ఆమె తెలివితేటలుకూడా అంత సునిశితాలని, ఆమె ధైర్య సాహసాలు అమోఘమైనవనికూడ తెలిసినా యతనికి. ఎంత విచిత్రమైనసన్నివేశంలో తానున్నాడో అర్థంకావడంతో బిగ్గరగా ఒక్కసారి నవ్వాలనిపించింది. కాని అతికష్టంమీద అణిచిపెట్టుకున్నాడు.

నిశ్చల తొణుకూ బెణుకూ లేకుండా, చైతన్య తట్టైనా చూడకుండా "ఈ మగపురుగులికే నీతీ నియమం న్యాయం లేవు! వంకర ముక్కువాడికి, మెల్లకన్నువాడికీ, నత్తివాడికీ, రెండక్షరాలు చదివి డిగ్రీ ఒకటి తగిలించుకోగానే తానొక మనిషైనట్లు లెక్క! అంతటితో విర్రవీగి, ఇంటింటికి ఉత్సవవిగ్రహంలా తిరుగుతూ, తగుదునని 'నా వెల అయిదు వేలు', 'నాధర పదివేల'ని ప్రకటించుకోవడం!......ఆ నత్తివాడైనా సరే, మెల్లకన్నువాడైనాసరే వచ్చి 'ఇదుగో చూడు నా వ్యక్తిత్వాన్ని కొలవడానికి ప్రమాణాలు, కొలతబద్దలు లేవు! ఈ విశ్వమే నా హృదయం! నేను నీ కివ్వగలిగింది నా ప్రేమ పెన్నిధిని! నాకు కావలసింది నీ నిష్కల్మషమైన హృదయంలో చోటు'-అని అడిగితే పూజిస్తామని యెదురు చూస్తున్నాను!...కాని...ఛీఛీ...బజారు పురుషులకు నా హృదయంలో స్థానం లేదు..." అని యింకా యేదో చెప్పబోతూనే వుంది...ఇంతలో ఆ నయాగరా జలపాతపు హోరుకు అంతరాయం కలిగింది. "మురళీధర్రావుగారు - టెలిగ్రాం" అంటూ పోస్టుబంట్రోతు లోపలికి వచ్చి నిశ్చలకు టెలిగ్రాం అందిచ్చి వెళ్ళాడు. టెలిగ్రాం కవరు చించుతూంటే ఆమె సున్నితమైన వ్రేళ్లు సాగకుగా వణుకుతున్నాయి. టెలిగ్రాం ఒకసారి చదివింది. ఆమె కనుబొమలు ఆశ్చర్యంతో పైకి లేచినాయి. మళ్లా చదువుకుంది. ఇంకొకసారి కూడా చదివింది...ఆమె ముఖం వెలవెలబోయింది. ఆమెలోని యీ మార్పులు తీక్షణంగా పరిశీలిస్తున్న చైతన్యకు ఆమె కాటుక కంటి రెప్పలు త్రుటికాలం పైకిపోయి తనవంక చూచి, తన చూపులతో కలిసికొని మళ్ళా బరువుగా దిగిపోవడం గమనించాడు. చైతన్య "ఇదేదో క్రొత్త కాంప్లికేషన్ లాగుందే! దీని యింప్లికేషనేమిటో?" అనుకుంటూంటే నిశ్చల కలువరేకులవంటి కనురెప్పలను రెపరెపలాడిస్తూ, ప్రాధేయపూర్వకంగా చూస్తూ, బొంగురుపోతూన్న గొంతుకతో "క్షమించండి! మీ రన్నట్లు నేను ఘోరంగా పొరబడ్డాను... నే నెదురు చూస్తూండిన వ్యక్తి మీరే ననుకొని..." అంటూన్నంతలో మురళీధర్ బూట్లు టకటకలతో లోపలికొచ్చాడు- "ఏమిటి చిట్టీ! క్షమించడ మేమిటి? ఎవరిని? ఎందుకు?... ఓరి పిడుగా! నివెప్పు డూడిపడ్డావురా?" చైతన్య సోఫాలోంచి ఒక చిన్న కుప్పిగంతేసి మురళీధర్‌ని కౌగిలించుకుంటూ "అరే భాయీ! ముందర చెప్పరా! నాకు వంకర ముక్కుందా? మెల్లకన్నుందా లేక కుంటికాలేమైనా వుందా?"

మురళి విరగబడి నవ్వుతూ - "నీ హాస్యం పాడుగానూ! వచ్చీరాకముందే ప్రారంభించావుట్రా నీ వేళాకోళాలు?...ఆం... ఆం...అదేమిటి చిట్టీ! ఆ కన్నీళ్ళేమిటేం?.. ఒరేయ్ మా చిట్టిని నీవేం వేపించుకు తినలేదు కదా?....ఏం జరిగింది చిట్టీ?..."

"చెల్లెల్రా బ్రదర్! భగవాన్! తుఫానురా...బ్రదర్...టైఫూన్!" అన్నాడు చైతన్య వణికిపోతూ.

"అసలేం జరిగిందిరా? ఏదో గ్రంథం వుందల్లే వుందే?"

"తిరుగుబాటురా బ్రదర్ తిరుగుబాటు! కాదు కాదు తిరుగుబాటులో పొరబాటు!" అన్నాడు చైతన్య సీరియస్‌గా ముఖం పెట్టి!

నిశ్చల యింక తట్టుకోలేక అన్నయ్య చేతిలో టెలిగ్రాం పెట్టింది గుట్టుగా. మురళి భుజాలమీదుగా చైతన్యకూడా చదివాడు. సరి - యిక యిల్లంతా దద్దరిల్లిపోయేట్టుగా, ఉరుము లురిమినట్టుగా, ఒకరి నొకరు పట్టుకొని, సోఫాల్లో కూలబడి, మురళీ చైతన్యలు విరగబడి నవ్వడం మొదలెట్టారు. నిశ్చల ముఖం కందగడ్డైపోయింది సిగ్గుతో అవమానంతో, గిరుక్కున తిరిగి లోపలికి పరిగెత్తింది.

ఒక చేత్తో విసనకఱ్ఱ, మరొక చేత వేపుడుగరిట ధరించి హడావిడిగా కమలమ్మ లోపలికి ప్రవేశిస్తూ "అమ్మో! అమ్మో! ఎంత

(48-వ పేజీ చూడుడు)

★ తిరుగుబాటు ★

(35-వ పేజీ తరువాయి)

పొరబాటైంది! ఎంత పొరబాటైంది!! ఎంత అపచారం! అసలే యిది అతి వాగుడు కాయ! నే నంటూ నేవుంటా 'ఒకే ఆడపిల్ల కింత నోరు పనికిరాదురా'ని యేమన్నా విన్నారా? తనవాళ్ళూ, పరాయివాళ్ళని కూడా లేకుండా మరీ యింత విచ్చలవిడీ, నోటి దురుకూ! . అయినా నాకైనా తట్టిందా?.. నాతోనైనా ఒక్క మాటన్నావు కాదేం అబ్బాయీ?.. ఏమీ అనుకోకు నాయనా.. ఏదో తెలిసీ తెలీని బాలకం...,ఇంత రభసా చేసి. వుత్త పిచ్చి పిల్ల, నాదగ్గరికొచ్చి గుక్క నీళ్లు కుక్కుకుంటూంది."

చైతన్య "అబ్బెబ్బే ...నే ననుకోడాని కేముం దత్తయ్యగారూ!..ఎన్నన్నా నన్ను కాదుగా? అయినా అనరానిమాట లేమున్నాయి అందులో?" అన్నాడు తెలివిగా.

మురళి "గడుసువాడివిరా మొత్తానికి!... అత్యోయ్! వీడు నాతోబాటు చదువుకున్న నేస్తమే! - చైతన్యరావు! కాశీలో యిపుడు రిసెర్చి చేస్తున్నాడు. ఊరికే సెలవుల కొస్తూ నాకు తెలుపకుండా దిగి నన్ను బోల్తా కొట్టించాలనుకున్నాడు. గాడిల్ను! తానే బాగా బోల్తాబడ్డాడు! నిశ్చల బాగా బుద్ధి చెప్పినట్లుంది..." అని మళ్లా విరగబడి నవ్వడం మొదలెత్తాడు. నిశ్చల అమ్మచాటునుండి, వెకిలినవ్వు నవ్వుతూ తలగోక్కుంటూన్న చైతన్యను పరీక్షగా చూచింది

నిశ్చల చైతన్యను మొదటిసారిగా చూచినప్పుడే తట్టింది 'ఎక్కడో చూచినట్లుందే'నని కానీ ఆ వుద్రేకంలో జ్ఞాపకానికి వచ్చింది కాదు. రాత్రి అన్నయ్యా ఆయనా భోజనానికి వెళ్ళినపుడు హాలులోకి పోయి అన్నయ్య గ్రూపుఫోటోలో చూచింది. అన్నయ్య, ఆయన ప్రక్క ప్రక్కనే కూర్చునున్నారు మొదటివరుసలోనే క్రింద అచ్చువేసిన పేర్ల పట్టీలో చూచింది చైతన్యరావు ఎమ్ ఎస్సి అనివుంది. "ఈ ఫోటో ఎన్నిసార్లు చూచుంటాను. సమయానికి జ్ఞాపకానికొచ్చింది కాదు. అయినా చేసిన ప్లానంతా యిట్లా పట్టాలు తప్పిందే! ఇంతకీ పాపం ఆయనే మనుకున్నాడో మేమిటో! మొదట్నుంచీ అంటూనే వున్నాడు 'పొరబట్టున్నావో' అని. వినలేదు! ఎంతతలతిక్కగా, నిర్లక్ష్యంగా మాట్లాడాను, పరిచయమైనా కాని ఆయన్తో! అందులో పాపం యిల్లు వెదుక్కొనొచ్చిన అతిథి, అన్నయ్య నేస్తంకూడాను! ... ఇంత గందరగోళమైనా అన్నయ్య కనబడగానే యెంతమనసిచ్చి నవ్వుతున్నారు! అబ్బ ఎంత సెన్సాఫ్ హ్యూమర్ ఆయనకి!" అనుకుంది.

భోజనాలైన తరవాత మిత్రులిద్దరూ చాలాసేపు యిష్టాగోష్ఠి జరుపుకున్న పిమ్మట మురళి అన్నాడు—"చైతన్యా! నీవీసాయంత్రం నిశ్చల ప్రవర్తనగురించి మరేమీ అనుకోకు! ఆ అమాయకురాల్ని అంతగా రెచ్చగొట్టినవాళ్లం మేమే! నీ వేమనుకున్నావో యేమోనని చాలా నొచ్చుకుంటూం దల్లే వుంది"

చైతన్య కీ మాటలేమి చెవి సోకినట్లులేవు "మురళీ! నీ వెప్పుడూ నీ కిలాంటి చెల్లెలుందని యెందుకు చెప్పలేదు?...కన్నుల్లో వత్తులేసుకొని వెదికి వేసారి కడపటికి నిరాశ చేసికొన్నానే — ఆ అదృశ్యప్రేయసి యిన్నాళ్లకు కనిపించింది! మొక్కవోని వ్యక్తిత్వం, ఆత్మగౌరవం నీతో పంచుకుందోయ్!.. అబ్బా! అయినా తల్చుకుంటే ఒళ్లు జలదరిస్తుంది! ఎటువంటి సిట్యుయేషన్, ఏమి క్లైమాక్స్!! ...మురళీ! నీ చెల్లెలికేం అభ్యంతరం లేకుంటే..." అన్నాడు, మురళి చేతిని తనచేతిలోకి తీసుకుంటూ!

మురళి చైతన్య చేతిని నొక్కుతూ మందహాసం చేశాడు!!

★

244 Persons are awarded prizes in our Competition No. 36 1st prize 213, 2nd prize 4, 3rd prize 21 and 4th prize 6 persons. Full particulars against 0—4—0 annas stamps

గెలవండి 25,000 గెలవండి

రిజిష్టర్డు నెం 328. పోటి నెం 38.

RAISING COMPETITIONS

KEY S. NO 36 #114 TO 129 = 486

122	117	129	118
119	128	116	123
120	127	115	124
125	114	126	121

We hereby certify that the above is the solution in original deposited with us by Raising Competitions No. 36 on 8.3.55 in a sealed cover which was opened in our presence to-day and that a copy of the above solution has been lodged with the Bank.

For The Premier Bank of India Ltd

సీలువేసియున్న మా అఫిషియల్ సొల్యూషన్ మొసర్సు. ప్రీమియర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు వారివద్ద డిపాజిట్టు చేయబడియున్నది. వారి అధికారముతో అది ప్రకటించబడును ప్రథమ బహుమతి ఆల్ కరెక్టు రు 12,500. రెండవబహుమతి, మొదటి రెండు లైనులు కరెక్టు రు. 6,500 మూడవ బహుమతి, మొదటి ఒక లైన్ కరెక్టు రు. 3,500. నాలుగవ బహుమతి మొదటి రెండు నెంబర్లు కరెక్టు రు. 2,500 మా కీ సొల్యూషన్ ప్రకారం నిలువుగా, అడ్డంగా యేటైనా వుండవచ్చును

ఆఖరు తేది 27-4-55 ఫలితములు 12-5-55

ప్రవేశ రుసుము ఒక ఎంట్రీకి రు. 1/-; 6 ఎంట్రీలకు రు. 5/-; 14 ఎంట్రీలకు రు 10/-

338

సాల్వు చేయవలసిన విధానము :—ఈ చదరములో 77 నుండి 92 వరకు గల అంకెలు నిలువునా అయినూ అడ్డముగా ఎటు కూడినా 388 వచ్చేట్లు వేయాలి. ఒక అంకె ఒకమారే వాడాలి. సాదా కాగితముమీద ఎన్ని ఎంట్రీలైనా పంపవచ్చును. ప్రతి ఎంట్రీకింద, పోటీ పంపువారు తమ పేరు అడ్రసు స్పష్టంగా పెద్ద అక్షరాలతోను, అంకెలతోను ఇంగ్లీషులో వ్రాయాలి. సొమ్ము క్రాస్ చేసిన ఇండియన్ పోస్టల్ ఆర్డర్లుగాగాని, మనియార్డర్లుగాగాని పంపవచ్చును మనియార్డరులైనచో మనియార్డరు రశీదులు పోటీ యెంట్రీల వెంట పంపవలెను ప్రతి మనియార్డరు ఫారముపై జతపరుచు కూపనులో సొమ్ము పంపువారు తమపేరు, అడ్రసు ఇంగ్లీషులో వ్రాయవలెను. "వసూలునుబట్టి బహుమతుల సొమ్ము మారుచుండును" ఈ పోటీలో మేనేజరు తీర్మానము ఆఖరు, చట్టబద్ధమైనది 0-4-0 స్టాంపులు పంపినచో పోటీలో గెలిచినవారిలిస్టు పంపబడును మా ప్రత్యేకరూల్సు, షరతులు బాగా తెలిసినవారే పోటీలో పాల్గొనవలెను

THE RAISING COMPETITIONS No. 38, 28 (3), Thandavaraya Gramani St., MADRAS-21.